# బుక్కిందె దక్కింది !

గండ్ల నర్సాపురం మళ్లా పెద్ద గుర్రాన్ని ఎక్కింది . అంటె 'నిషా' జోరునెత్తికి ఎగవాకింది ! 'నిష' అంటె ? అది వుత్తుత్తమైకం గాదు. 'నిష' అంటే అసొంటి యిసొంటి నిషగాదు. ఎంపికపు పంద్యాల కిక్కు. ఇట్లని నేను మీకు జెప్పుతుంటె యిదేందో ? కైతల కరామతు అంట అనుకునేరు. కైతలోలె గానొచ్చెనిజం. నిప్పసొంటి నిజం !

ఆనాడు, గండ్లనర్సాపురం కలవడ్డట్ల గొరుకొయ్యెలు గొట్టెట్యాళ్లకె వుల్కిపడి నిద్రలేశింది. పక్కదుల్పుక లేశిన కాణ్ణించి వూరన్నవూరు వొగర్నిమించి వొగరు కుచ్చుల కోలాటం ఏసినట్లె తక తక లాడ్తుండరు. ఎవర్ని జూసినగని వుర్కులు పర్గులె ! నిల్కడన్న మాట వుంటె నొట్టు. ఎవర్ని వల్కరిచ్చినగని గడిసేపన్నకుదురుగ గూసుండి జోలిజెప్తం అనరు. ఏందో ? అంత చిత్రాలు సిగురేస్తున్న కాలం ! అర్ధమ్మరేతిరి దాటినగని కంటికి కూర్కువుండదో ? లేదో? కండ్లకు సొంటి గందం బెట్టుకోని జాగారం జేసినట్లమంది పోవడి గండ్ల వడ్తుండది గని సద్దుమణిగి నిద్ర జొచ్చిన జాడేలేదు.

ఏందో ?కారుణం ? యా గద్దెలు కూలెటందుకు వుండవొ ?యాడ రాజ్యాలు ఎలుస్తుండవొ ? యాడ ?తోకసుక్కవొడుస్తుండదొ? వీండ్లకేం ? దిగవడ్తుండదొ ? సూస్తున్న కొద్దికి గడ్డిపోస కాణ్నించి గడ్డ పార దాంక పల్కువడి వెంచుకోని సరాయించుకుంట తిర్గుతుండయి.

పన్కిరాని పాతలన్ని పనివుట్లు ఐతుండయి. వెన్నకు పండ్లు రాంగ కర్వజూస్తున్నట్లవుండది. ఇదేం? తమాసనా?

తమాసగాదా? మరి! వోవారందిర్గితె ఈ వూళ్ల సభ జరుగుతుండది. గాయింత దెల్వద?'సబ'అంటె ? అసొంటి యిసొంటి జిట్టెడు జానెడు సబగాదు. గండ్ల నర్సాపురం పణమీద రాసిన పాతగీతలు తుడ్సుకపోయి కొత్త జాతుకాలు సృష్టిచ్చెసబ. అందరికి తిండి బట్ట పుష్కలంగ అందిచ్చెసబ, ఎచ్చుతచ్చులు కలెదున్ని అంత ఏకం జేసె సబ.

ఈవూరి మనిషి రేపు వోట్లల్ల నెగ్గి నెంబరి ఐ, అటెంక 'మినిష్ట'రై గద్దెక్కి మన వూరి పెద్దకాపు నాగయ్య కాకెర వొడ్లు నిల్వజేసె పెద్ద గుమ్ములు పెట్టేటి గరిసెలేదు? అంత మోటురి ఎక్కి రయిఁ మంట వొక్కదమ్మున మన యిండ్ల వాకిండ్ల పోంటి పొయ్యేటి సబ' అందికె మంది అంతకుశాలువడుకుంట పల్లెకు పల్లె బొంగురం తీర్గదిర్గు తుండరు.

ఇంగ ఈ సందట్లనె వుషారి మంది వూకుంటారు? కతల కత అంట పబ్బం గడ్పు కుంటరు. 'చేసెటోణ్ణి జూస్తెసచ్చెటోడు లేసి వొచ్చిండంట. అనివూకనె వుట్టిందె? సామితె ? వుత్తపున్యానికి యిండ్లు బాగజేపిచ్చుకుందం అంట, యిండ్లల్ల యాడున్న సెత్త అంత దెచ్చి బయుట వారేస్తుండరు. పిల్లలు ఏవెూ సందులు, సడక్‌లు అన్ని వూడుస్తుండరు. అంటె వూడ్పిస్తుండరు. యాడవట్టిన బూజులన్నిదులుపంగ, వుల్లెళ్లు, సాలెగూళ్లు, పాసుట్లు అన్ని యిడ్సి గోడలన్ని జళ జళ ఐ తళ తళ మెరుస్తుండయి.

ఇంగ వూళ్లెకు గ్యాసు నూనె బండి వొచ్చింది. శక్కెరొచ్చింది, అయితె ఈ త్యాప కోమటి లింగయ్య మడిగెలకు గాకుండ పంచాయితి కచ్చేరికి జేరింది. ఆడికెళ్లి అంధరికి పంచుతరంట నోర్లు అప్పుడె తియ్యగైతుండయి.

ఇన్నాళ్ల వట్టి గా(నాని పంతులయ్య వొచ్చిండు. ఎన్నాళ్లనుండో? సర్పంచ్ యిల్లు జేరిన కుర్చీలల్ల యిర్గి మూలన పడ్డవి పోంగ మిగిలిన మూడు కుర్చీలు వొచ్చినయ్, పంతులయ్య యిల్లు జేరి కాపిరం జేస్తున్న బెంచీలల్ల అమ్మగారి గడెమంచం కిందికి జారిందిపోను, మిగిలిన నాల్గు బేంచులు వొచ్చినయ్. కర్ణంగోపయ్య కచ్చేర్ల కరామత్ జూపుతున్న 'టేబిలి' వోకాలిర్గి కుంటుకుంట, గెంటుకుంట వొచ్చిచేరింది. పంతులు పెండ్లాం తాయారమ్మ ముగ్గులేయంగ, సంటిది నముల్కి మింగంగ, ఇంగా వొగటి రొండున్న 'చాకుపీసుల' డబ్బ కొండొచ్చి పంతులయ్య పాపం ! 'మన దేశం భారతదేశం ' అంట 'నల్ల బోరటి' మీద రాసి దేశ భక్తి పాటం నేర్పుతుండడు.

ఇంగ ఏండ్లకోలె నిత్తె దీపారాధన లేక, దుమ్ముగొట్టు కోని గబ్బిలాల కొంపోలె కండ్ల వడ్తున్న (బ్రహ్మచారి వీర అనుమాండ్ల గుళ్లకు వష్టిమయ్య మడిపంచె తాతల నాటి 'శాగరమట్టిసిలక్‌ది' కట్టు కొచ్చి రొండుపూటల దీపెం ఎలిగిచ్చి, గంట వాయిచ్చు కుంట ఆరగింపు జేసి నైవేద్యం బెట్టిన పులోరను ఆడగూడిన నల్గురికి సేతులల్ల తలో గంటెడు ఏయవట్టిండు.

ఇంగ ఆ వూరి పటేలయ్యను వల్కారిచ్చెటట్లలేదు. వొచ్చి పొయ్యేటోండ్ల పర్వరాయిల మున్గితేలుతుండడు. కర్ణప్పంతులు కత చెప్పెటట్లు లేదు. ఇదంత జూస్తున్న మొల్ల సావుపక్క వూళ్లకెళ్లి ఆపసోపాలు వడుకుంట వొచ్చి బాటన వొచ్చి పోయెగొడ్ల రాస్కోంగ గచ్చుల పెచ్చులూడి యిట్కాలు దేలిన పాతగోరి మీద పచ్చదట్టిగప్పి, మల్లె పూల దండ చెడాయిచ్చి వూదుపొగేసి, నెమలి కట్టతోటి సుతారంగ వూపవట్టిండు.

ఎందుకన్న మంచి దంట బాజ భజంత్రీలోళ్లు ! పీకె, డోలు సవరిచ్చుకోని, పొద్దు పొడ్వక ముందె బూపాళాలు సదివినట్ల 'పీ, పీ' మన వట్టిను. ఇంతట్లకె కసి పావూళ్లకెళ్లి నీలిమందు మోతాదు ఎక్కువేసి సల్వజేసిన తెల్లసీరలు గట్టుకోని 'పసిపిల్లలకు సీమిడి ముక్కులు, గజ్జిపుండ్లు, వుండగూడదు అంట ఆర్గదీసిన సబ్బు బిల్లను రాకి రాకి పిల్లల దొర్కవట్టుకోని కడిగి సూపవట్టిను.

ఇంతకాలం మిన్నులు దప్పమన్నులు తొక్కిసూడని మారాజులంత, దోతి కొనలు సేతులల్ల వట్టు కోని పురాగ గూడెం లకె రాకపోకలు సాగిస్తుండరు. సూడు సూడు మంట మన పెద్దింటి బొడ్రాతి ఎల్లని బిడ్డ బీరిలేదు. దాని పెండ్లొచ్చింది. నయాన్నో ? బయాన్నో ? ఎల్లడు బిల్సిన, పిల్వకున్నగని, యీ ఎత్తర్లంత పెండ్లి మాట యిట్ల చెవుల వడంగనె గూడెం జొచ్చి, యాళ్లాడేసిన తోళ్ళూ తిత్తులు మొకాలకు దగుల్తుంటె మామిడాకు తోర్ణాలను తప్పిచ్చుకున్నట్ల వారగ అనుకుంట పోయి బీరిని దాని మొగణ్ణి కాగలిచ్చుకున్నంత దగ్గెర్లకు జరిగి పోటు దింపిచ్చుకున్నరు.

రాంగ రాంగ నెలలునిండి పురిటి దినాలు దగ్గర వడ్డట్ల ఎన్నికలు రేపో ? మాపో? అన్నంత దగ్గెరకు దర్మకొస్తుండవి. ఇవే నాల్గురాళ్ల రాలంగ రొండు రాళ్ళురేపటి కోసం ఎన్కేసుకునెదినాలు. యిసొంటప్పుడు వోగుమాలి కూసుంటె ఎట్ల ? అంటవొగర్ని జూసి వొగర్ను ఏగిర్తపడుతుండరు. పనిలేక పాతపడ్డ జౌ జార్లన్నిటిని మెరుగువెట్టు కుంటుండరు.

మేరోండ్లు మూలకేసిన కుట్టు మిషన్లు ఈ వలికి దీసి నూనెలు వోసి చెక్రం దిప్పుతుండరు ' అవును మళ్లరేపు మీటింగు పందిర్లకు జాండలు గుట్టేది మేమేగద ! అంట కత్తెర్లు గుడ సర్పిచ్చుకుంటుండరు.

ఇంగ పట్కారోళ్లే మొ యాడవడ్డపాత బట్టల తాళ్లన్ని దుమ్ము దుల్పి రంగులు

ముద్దుగ కండ్లవడెటట్ల వాగదానిమీద వాగటి జోడిచ్చి పెట్టవట్టిన్రు. రేపు వాలంటీర్ల అంగీలకు, టోపులకు, యారంగులు ఎన్నెన్ని అక్కరవడ్తవా ? అంట దేవులాడ్తుండరు.

సాలోళ్లంత దారపులడీలు దెచ్చి రంగులద్ది ఎండినంక బిండెలు సుడ్తుంటె, ఆడోళ్లెమొ రాట్నాలు పెట్టుకోని దారం దీస్తుండరు.

మ్యాదరోళ్లు, ఆడి మందికి 'కైకిలి' గట్టి అడివికి దోలి ఈ పార్క ఆ పార్క దెప్పిచ్చి అందరికంటె ఆత్రంగ తడ్కలు అల్లుతుండరు.

బిచ్చగిత్తి రొండు సేతుల వొడ్పుతోటి కవ్వర కవ్వర అర్సుకుంటనె ఈత సాపలు అల్లుతుండది.

ఇదంత రేపటి సబ జేస్తున్న చవుత్కారవా? అంట ఆడ్గుతుండారు? అయ్యెకత! 'రామాయణం అంత యిని రామునికి సీతమ్మ ఏంగావాలె' అన్నట్లుండది వైనం. యింగజెప్త యినుండి ఇనసొంపైన ముచ్చెట.

ఇట్ల సూస్త సూస్తుండగనె వూరి రంగె మారవట్టింది 'వూసరిల్లోలె' తడ్కలకు, దళ్లకు, బొంగు కర్రలకు, డేరలకు, సాపలకు, యిస్తార్లకు సెప్పలేనంత గిరాకి పెరిగింది. ఇది అట్ల వెట్టి యింగో సంగతి - ఎన్కటి దినాలు గావు, ఇప్పుడు సబజేసుడంటె 'శెర్కస్' జేసినంతపని, ఈ దినాలల్ల సిత్రంగ పనివెరిగి మందికర్వు పుట్టుకొస్తది.

బూరవూదితె పదిరూపాలు, వూకెసేతులూపుకుంట ఎంటవోతె అయిదు రూపాలు 'జై అంటె రూపాయి, పదిమందిని కూడగొడ్తె పదిరూపాలు సప్పట్లు గొడ్తె త్యాప త్యాపకు బాగనె ముట్టజెప్తరు. కొటిస్తె రొండు రూపాలు యింగ వోటేస్తే? అప్పటి రేటు వట్టి బిర్యాని, బియ్యం, పొట్లాలు, సీరెలు, రయికలు, దండాలు అన్ని. పది వోట్లు పెట్టేలేపిస్తె అమ్మొ! అమ్మొ! 'ఈ వోట్ల తల్లి' దినాం వొస్తె ముద్దుగుండు, కూసున్నతాన సంపాదన, కష్టం లేని కూలి. 'కుశికి కుశి కూలికి కూలి' అంటెయిదేనేమొ? మంది అవ లీవలవడ్తుండరు.

ఇంగ వూరంట పుట్టినంక సబలు సత్కారాలంట జర్గుతనేవుంటవి. అట్లె జర్గుతుండెగుడ, గని, వోట్ల సబగాదు, మనకు సొసంత్రం అంట వొచ్చినంక అన్ని ఎన్కకు వొదిగి వోట్ల సబలు ముందుకు వొచ్చినయి. ఎన్కటికి సొసంత్రం అంటె ఏం దొ? మాకు

దెల్వకుండె, ఆడోళ్లకైతే యా మాటయినవడదు, వొంటలు, వార్పులు, అల్కు-పూతలు, జగుడాలు, కాకుంటె పండుగలకొ, పబ్బాలకో, పెండ్లిండ్లకో, నల్గురుగల్సి నప్పుడు నగి ముర్సుకుంట, అప్పాలుగాల్సి తీసుకుంట, ఆజోలి యాజోలి పెట్టుకోని పరాశ్కాలాడు కుంటుంటిమి. ముచ్చెట్లంటె ఏందను కున్నరు. గావొదినె సీర బాగుండది, గీ అక్కరయికె ముద్దుగుండది, అమ్మొ ! ఆమె మెడ నిండ సొమ్ము దిగేసుకున్నది గంగెద్దోలె' అంట ఆడి పోసుకునుడె, అయిన గని ఈయాళ్లటి ఆడోండ్ల తీర్గ కడుపుల యిసం బెట్టుకోని పండ్ల బిగికి నగకుంటిమి.

అమ్మో ! నేను యాడ్కో-వోయి, మిమ్ములను నా ఎంట దిప్పవడ్తి? జరవొప్కు-వట్టుండి. ఈ వోట్లు పుట్టినంక, అవి పల్లె పట్టణం అంట ఏరుతారు జేయకుండున్నట్ల పల్లె గొంపలల్ల గుడసోటు జేసుకున్నవి. అయితె అప్పటి వోట్ల సబకు యిప్పటి సబలకు శానా బేదం వుండది. ఎంత బేదమా ? ఎట్లజెప్త ? 'బూతల్లికి గగునమయ్యకు వున్నంత ఫరక్ అంటె సరిపోతది.

ఆ దినాలల్ల కలల బక్షాలు దిన్నట్ల యా ఐదేండ్లకో వోట్లసబ జరుగుతుండె. ఆకాలాన యీవోట్ల 'సబ' అంటె ఎల్లమ్మ పండుగతీర్గ వుండేది. అప్పుడు వోజీపిమోటరు, పది యిర్వైగల సైకళ్లు రేపు సబ అనంగ వచ్చేయి. ఇంగ ఆవిటిని జూడ పిల్లలు, పెద్దలు అంత కూడు నీళ్లు ఎడవాసి ఆబ్లె. కాపిరం వుంటుండిరి.

ఇంగ తెల్లారి'మెంబరి' మెరిమెణగ బయిలెల్లెదినం. ఆనాడు నాల్గు ఎడ్లు గట్టి సింగారిచ్చిన వో పెద్ద బండి, వో పదిగల ఎడ్ల బండ్లు, రచ్చ బండకాడ ఆ పెద్దయ్య మెడల ఏసెటందుకు వో మెర్పుదండ, రొండు పూల దండలు, వూరుసొటియ్య తొప్పెట్లు, వో బూర. ఇంగ, వో పుట్కొడు బొంగుపుట్నాలు, వోసిన్న సంచెడు బెండ్లు బత్తీసలు, వోసిన్న గంపెడు అప్పటి కష్ఫాము కోమటి యీరయ్య ఆయిన పెండ్లం శివమ్మ గల్సి బూంది గొట్టి ఆ పూటం నేతిల గాల్సి కట్టిన లడ్డూలు.

ఈ సిరిదిండి ఎందుకంటె ? ఏం జెప్పుత ? ఇనుండి .ఈ సబల గణ గణ గంట గొట్టినట్ల దగ దట్టంగ మాట్లాడే మెంబరీలు దూపగొంటె మంచి నీళ్లిచ్చి, సైగ జేసి నప్పుడల్ల సప్పట్లు గొట్టి జై, జై అంట లొల్లి వెట్టిన పోరగాండ్లకు పంచెటందుకు. గని యిప్పుడు ? మీకు దెల్సిన పంచాంగమె. అప్పటి కాలాన, రచ్చకట్ట మీద మాట్లాడినంక సప్పట్లు గొట్టాలె అంట గుడ దెల్వకుండె మందికి, అందికె వూరి సర్పంచు గొట్టంగనె

కొట్టాలె ఎప్పుడన్నగని' గాందితాత'' నెహ్రూ' అంట వల్కితె సాలు, సప్పట్లు గొట్టాలె అంట జెప్పిన్రు.

ఇంగ నేను సద్యుకునె టప్పుడు ఒగ ఆడామె మెంబరిఐ మాసాల్లెకు వొచ్చి మా ఆడి పోరగాండ్లను అందర్నీ వోసబకు దోల్కపోయి మా అందరకి పిప్పరమెట్లు యిప్పిచ్చి, 'రంగమ్మ' అంట తనపేరు వొచ్చినప్పుడల్ల సప్పట్లు గొట్టాలె అంట జెప్పింది. ఇట్లే యింగో ఆడామె మెంబరి ఐ మాసాల్లెకు వొచ్చి ఐస్కరం పుస్కరం అంట మాట్లాడి మా పోరగాండ్లను అందర్ని వో సబకు దోల్కవోయి మా అందరికి చాకిలేట్లు యిప్పిచ్చి 'రంగమ్మ' అంట పేరు వొచ్చినప్పుడల్ల ఎవరన్న సప్పట్లు గొడ్తె గిచ్చుండి అన్నది, గిచ్చితె అందరు జూస్తరని మేం తొడపాశం బెట్టినం. ఇట్ల సాగుతుండె సబలు.

ఈ త్యాప సబకు వొచ్చెటోళ్లో మొ వుత్తుత్తోళ్లు గారంట! అపూటం మెర్గు బంగారం మిర్పకాయె బజ్జోలె నముల్క మింగె టోళ్లెనంట. ఎంత పుణ్ణెంజేసుకున్నదో ? యీ గండ్లనర్సాపురం. ఆఁ ఎసోంటి? ఎత్తులను జూస్తుండది? వీండ్ల దర్శినం అంటె దైవ దర్శినం కన్న ఎక్కువ. అందికె వోట్లమ్మ ప్యాద సాద జనాన్ని కనికరిచ్చినట్ల ఐదేండ్ల కోసారి ఎన్కటికి గని, యిప్పుడు రొండు, మూడేండ్లకె ఎన్నికలు దెప్పిస్తుంటె మంది 'కర్వయిర్గ' పెద్ద పెద్ద నెంబర్లను, మినిష్టరయ్యలను, జూస్తుండరు. లేకుంటె ? టికెటి గొన్కొని తిర్పతికి పోయి వుత్త పున్యానికి సత్రంల బువ్వగినదిని గుండంల మున్గి దర్మదర్శినంల వొర్సగట్టి నిలవడ్తె ఎంకటేశ్వర్లను జూడొచ్చుగని, గద్దెక్కిన మనూరోణ్ణి జూడొచ్చు అనలేం. అంతటి అదృష్టం కాలి బాట పోంటి నడ్సుకుంట మనూరి కొస్తుండది.

అయితే అంతటి మా మారాజుల సొంటి నాయకులోళ్లు మనూళ్లకు యిర్కటపు సందులు గొందులల్లవడి ముద్దుగ కలెగల్పుగ 'అక్కాసెల్లె' 'అన్నా తమ్మి' అంట, అనుకుంట, మోటారికార్లు దిగి, కాలి నడ్కన నడ్సుకుంట వొస్తరంట! వాళ్లకు మొక్కాలె! నూరను, ఆరను! ఎంతైన బారిబుద్ధి బారి బుద్దె! నిజంగనె! గొప్పోండ్లకు పోకళ్లు వుంటాయ్ ? వుండవు ? నిండుకుండ తొణ్కదు. మన లేకిడి మందికె నీల్గుడు ఎక్కువ. ఏం లేకున్న కొర్ర మట్టలోలె నీల్గుతరు. అందికె అంత పొడుగు ఎల్గుతుండరు.

ఇంతకు అసలు సంగతి ఏంది ? అంటె, రేపు మన వూళ్ల సబగద! యింగ ఆ సబ కంట వొచ్చె మానుబావులోళ్ల కాళ్లు బూమ్మీద మోపంగ ఈన్యాల మీదుండె గర్క

బొర్కులు, గుల్కరాళ్లు, పెంకాసులగిన గుచ్చుకోగూడదు, అంతేగాదు సందు బొందు లల్ల నడ్సెట్యాళ్ల మల్సిన నీళ్లల్ల పందులు, కుక్కలు అడ్డ దడ్డ ఈదులాడంగ ఆ బుర్దనీళ్లు జల్లి వీండ్ల కాళ్లు అల్కువడ గూడదు. అంట వూరి పంచులు పదురుకోని-

'యాదో ? వుద్దబక్తి తీర్గ మనం 'రోడ్' ఏయాలె అంటె ఏయాలె అనుకున్నరు. వాండ్ల సామ్మేంబోయింది ? పురెక్కిస్తెసాలు చేసెటందుకు సాల్లెపిల్లలు వుండనె వుండిరి. యిగ జూస్కోండి తడాక!

సాల్లె జదివెటోళ్లు, పెద్ద యిస్కూలు సదివెటోళ్లు, సోర సోర దుడ్డెగాళ్లు, అంత గల్సి కొర్విసేమలోలె ఎగవడి, పాయింట్లు లాగులు మీదికి ఎగజెక్కిబక్కపల్సటి పోరలు కడ్డీలోలె సేతుల పారలు పట్కోని పనిజేయంగ, ఎన్నెల తార్లసొంటి ఆడివిల్లలు మొరం గంపలం దియ్యంగ ఎర్రటి ఎండలల్ల ఎన్నెల రాత్రులోలె కుశాలు వడుకుంట కోశెడు సడ క్ను వోపది పదిగేను దినాలల్ల ఖతం జేసిన్రు. నలుబై, యాబైవేల రొక్కానికి దంగని 'రోడ్' పని, దమ్మిడి దండుగ లేకుండ వానరసైన్యం వారది గట్టినట్ల గట్టిరి.

ఎవరి రెక్కల కష్టం ఐతే ఏంది ? గని వూరికి మట్కుకు మంచి గట్టి కంకర రోడ్డు దక్కిపాయె.

ఇంగ ఈ పిల్లల పని మెచ్చిన పెద్దయ్య రేపు యీడ్కివొచ్చినప్పుడు నిండుసబల ని లవడి సొంత చేతుల్తోటి సర్కారుమోరుగొట్టిన సన్నదు కాయితాలను వీండ్ల సేతుల వెట్టి సెబాస్లు వల్కి చేతుల చేయి గల్పుతడంట! ఎంత పెద్ద మనుసుగాకపోతే గీపోర గాండ్లకు యింత ఖదరు యిస్తాడు ? ఎంత బాగ్గెం మనపోరగాండ్లది ?

ఈత్యాప ఎన్నికలల్ల నిలవడ్డోళ్లకంటె వాళ్లను నిలవెట్టినోళ్లు మాంతమై నోళ్లంట, అంత జోడుగుర్రాల సవారి జేసెటోళ్లెనంట. గుండెలు దీసి గూట్ల నెట్టిన బంట్లే! ఈ ఘటాన ఘటికుల మహిమ దెల్సుకోని ఎదురొడ్డి నిల్సుడేం మాటలతోటిపనిగాదు. న్యాల శెనిగె సేను ఏరెటప్పుడు బుడం, ఏరు, కాయ అనకుండ సెట్టుకుసెట్టే పీకేసినట్ల వీళ్లుగుడ ఎదిర్ని పీకి, దుల్పి, జాడిచ్చి, యిర్సి, నల్సి, జూడగాన్రాకుండ జేస్తరు. పూర్ణపు కజ్జెకాయను అపూటం నముల్క మింగినట్ల మింగుతరు.

అన్నిటికన్న అంతు దొర్కని గోపిరమైన ముచ్చెట యింగోటివుండది, వుత్త దినాలల్ల ఈ మానుబావులోళ్లకు ఎడమొకం, పెడమొకమె! వీళ్లనడ్మపచ్చిగడ్డి ఏస్తె భగ్గు

మనెటంత కువ్వారం . ఏయాళ్ల నిప్పుల వుప్పేసి నట్లె సిటపటలు, గని ఎన్నికలు వొచ్చినయ్ అంటె సాలు ! అన్నదమ్ములోలె కల్సిమెల్సి అంత ఏకమైం కూడ వలుక్కున్నట్ల, పదురుకున్నట్ల, వొక్కతాటిమీద నడ్సినట్ల, అల్లిబిల్లి ఐనట్ల వొప్పందం జేసుకుంటరు. ఇది వోట్ల పంపుకాల మట్టమే అటెంక ఎవరితోవవాళ్లది. ఎవ్వరి బత్కు దెర్వువాళ్లది. ఎవ్వరి గుర్తులు వాళ్లవి.

బూమివాటం జూసి నీళ్లు వారి నట్ల, జనంనాడి జూసి, కాలం మొగ్గుజూసి నడ్వ నేర్సిన రాజకీయాలోండ్లు వీళ్లు. వీళ్లయిక్మత్ చెప్పతరంగాదు. పూలపరువమోలె ఈ నాయకయ్యల మెర్పు గూడ నూటికో కోటికో దప్ప శాన్నాళ్లుండదు, అందికె వీండ్లకు ఎత్తుకుర్సీలెక్క ఆత్రం ఎక్కువ. మళ్ల అందుకు దగ్గ ఏశాలు వడకుంటె ఎట్ల ? అందు కని వీండ్లల్ల బాగ దక్కా ముక్కీలు దిని అనుభవం సంపాదిచ్చుకున్న నాయకయ్య సిన్న నాయకులను జూసి వోకట్టడి తీర్గ జేసిండు. అందర్ని వోకాడ కూడగొట్టి-

సూడుండి ! దినాలు ఎన్కటి తీర్గలేవు. మందిపురాగ లేకున్న జర జర కన్ను దెరుస్తుండరు. ఈదినంల మేమే పెబ్బులం అంట 'అగ్రం ఉగ్రం' అంటెకుదురదు. 'అంబావానికిపోయి కుక్కసావు సచ్చెనంట ' ఆంబావం పన్కిరాదు, అంబావం యిడ్సుడు అంటె న్యాల సూపులు సూడ మంట గాదు, మనం ఎంపికె గుర్తులు ఏరెటప్పుడు జర ఎన్కముందు జూసి ఏరుకోవాలె. ఆ గుర్తులన్ని ఆడ్కనవడి అయ్యోపాపం అన్నట్లవుంటె మంచిదంట పర్సుబండన జెప్పిన మాట పోంటి ఈ మన గండ్లనర్సాపుర పోండ్లం గుడ నడ్సుకోవాలె . అందికె మనం గుడ అంబ్యాదగ కండ్ల వడె గుర్తులె ఏరుకుందం ' అంట అన్నడు. అందరు 'ఔనంటె' ఔనన్నరు.

ఎంపికైన గుర్తులు- ఒకటి ఎల్కపిల్ల, రొండు కప్పతల్లి, మూడు 'యిస్త్రారి' నాలుగు గడ్డపార,అయిదు సీపురుకట్ట- నిలవడె నెంబర్లు అయిదు మంది అయిదు గుర్తులు ఎన్నుకున్నరు.

సభకు జర ఆలిశెంగ వొచ్చిన సిమ్మయ్య మంట మంట అనుకుంట లాజిగ గొంతుజేసి 'మరీ ఎట్టి గుడ అంటె ఎట్టి గుడ అని యిదేం పెద్దిర్కమయ్య ? నన్ను ఆయిన్ వక్తుల మీటింగుకు పిల్వకుండ సబజేసి గుర్తులన్ని మీరె గుత్తగొన్నట్ల సొంతం జేస్కుంటె ఎన్కవడ్డోళ్లం యాడ్కిపోతం ? అంట 'గాడ్దిగుర్తుకు సంచకరి గట్టిండు.

ఎన్కటికి ప్యాదరాశి పెద్దమ్మ కతలల్ల ఏడేడు సముద్రాల ఎన్కమర్రిసెట్టు తొర్ర లున్న సిల్క ముక్కున కర్సుకున్న మర్రి పండు లోపటి గువ్వంల మాయల పకీర ప్రాణాలు దాపెట్టి నట్లు రేపు ఎన్నికల సబలల్ల జరిగె ప్రచారానికి ఆయువు పట్టు అంత ఈ గండ్ల నర్సాపురం వాగుల్నె వుండది. ఈ వాగె ఆ పల్లెకు, ఆపల్లె జీవునానికి ఆదెరువు.

ఈవాగుకు వరుదలొచ్చి యాట గండ్లువడుడు, వూరుమున్గుతదంటబయానికి మందేమొ సేండ్లు, సెల్కలు సెడదున్ని గడ్డీగాదం మోపులు గట్టి గండికి అడ్డంబోసుడు, అటెంక వుత్త బత్తలై తిండికెళ్లక గోడు గోడుమంటుంటె పెద్ద సర్కారు పైకం మంజూరు జేయంగ కట్టపోసుడు, నాల్గు పైసలు కండ్ల జూసుడు, మళ్ల వానాకాలం రాంగనె గండ్లు వడుడు మామూలయింది.

ఈ వూరు ఎన్కట వుత్త నర్సాపురమేనంట, గని యాట గండ్లు వడ్తుంటె దీని పేరు గండ్ల నర్సాపురమంట వడ్డది. యింత పేరు పోయిన యీ నర్సాపురంల ఈ పొద్దో ? రేపొ ? సబజర్గుతది.

ఈ త్యాప పోటీల నల్గురైదుగురు నిలవడ్డగని అందట్ల యిస్త్రారి గుర్తున్న నైకుంటానికి, సీపురు కట్ట గుర్తున్న తాయారమ్మకు గట్టి పోటీ వున్నట్ల కండ్ల వడ్తుండది.

అనుకున్న సబ రానే వచ్చె. తొల్దొల్త గడ్డపార గుర్తున్న మల్లేశం పార్టీలోండ్లు సబ వెట్టిన్రు. సబకు జనం బాగనె వొచ్చిన్రు. మైకి, లౌడీయిస్పీకరి గుడ అమరిచ్చిన్రు. ఇంగ మల్లేశం శంల జుట్టి ఎర్రంచున్న కర్రె తువాలు బుజాన ఏస్కోని గడ్డపార ఎత్తిపట్టి జనానికి జూపి తుపాకి దించినట్లు దించి పక్కన నిలవెట్టుకోని సెయ్యి ఆనిచ్చిండు. గని పక్కలున్న సిన్న నాయకయ్య లేసి ' సారు ! మీ వుపన్యాసం జోరున వూపందు కున్నప్పుడు ఆయింత గడ్డపార సేయి జారి కాలు మీద వడి కాలు యిర్గజిక్క అందికె దాన్ని మనబంటుకు అప్పజెప్పుండి' అడ్గినప్పుడు యిస్తడన్నడు. ఆ మాటలు యిన వడ్డోళ్లు కిల కిల నగిన్రు.

మల్లేశం మొదలువెట్టిండు- 'సోదరులార ! ఇన్నాండ్ల వట్టి కాయకష్టం జేస్క బత్కుతున్న మన అడ్కన వడ్డ మంది కడగండ్లు మొగులు మీద వున్న ఇంద్రయ్య బూమ్మీద బూతల్లి ' యిద్దరు జూస్తుండరు. ఇన్ని వడువాట్లకు, యిడ్మలకు మూలం ఈ సెరువు, ఇంగ యాట దానికేసె కట్ట. ఈ సెరువు కట్ట గండ్లు వడకుండ గడ్డపారోలె

గట్టిగవుండాల్నంటె ? మీరు గడ్డపార గుర్తుకె వోటెయ్యాలె ' అనంగనె అర్సవైన మొగోళ్లంత జాండలోలె గడ్డపారలు ఎత్తి పట్టుకోంగనె బూమ్మీద వాతిన గడ్డపార మీద రొండు సేతులు మోపి, అలనాటి ధర్మరాజు తమ్ముడు భీమన్న పోజుల నిలవడ్డడు సదరు గడ్డపార అభ్యర్థి మల్లేశం. అందరు సర్కాసు జూసినట్ల చిత్రపడుకుంట సప్పట్లు గొట్టిన్రు.

ఇదే సమయాన ఆవలి గట్టును పారజూస్తే నడుస్తున్నమోదుగు వన మోలె గాన్రా వట్టింది. ఇదేందబ్బ! అంటె ? ముద్దుగ అలంకారం జేసోని అడి మొగ ఆనకుండ వొచ్చి నిలవడ్తె అందుట్ల నోటి ధాటివున్న ఇస్తారు పార్టీ మనిషి లేసి నాల్గు దిక్కుల కలె జూసి గొంతు సవరిచ్చుకోని సరాయిచ్చి-

'తల్లులార! అన్నలార, తమ్ములార, మర్దండ్లు, బామ్మర్దులారా, దండాలు, నూటొక్కదండాలు! అయ్యా నాది ఇస్తారాకుల పార్టి, 'ఇస్తారాకు ' అనంగనె ఎత్తిపారేసి దంట తినస్కారంగ జూడకుండి. ఇస్తారాకు కుదురాల్నంటె ? ఎంత కష్టమో ? మీకు దెల్సు. అది వుత్తపున్యానికి గాదు. అందుట్ల సిన్నవి, పెద్దవి, గుండుటివి, సోల్పువి నానా తీర్ల ఆకులు కైగ యిమిడ్తెనె ఇస్తారాకు ఐతది. ఇట్ల మనోల్ని మన సెర్వు గట్టు గుడ గండ్లు లేకుండ గట్టివారి బిగిజిగితోటి వుండాల్నంటె, రేపు మనం కులం, తలం, ఎన్కా ముందు, ప్యాద, సాద అంట ఏరుతార్లు మర్శి ఆకాకు గల్శి ఇస్తారాకు ఐనట్ల కలెగల్సున వుండాల్నంటె ఇస్తారు గుర్తున్న నాపార్టీకి వోటు ఏయిండి. అంట అనుకుంట దబ్బున వో ఇస్తారు కిరీటమోలె నెత్తికి జట్టుకోని తన తోకనె సింహాసన మోలె సుట్లు దిప్పి రాణాసురుని దర్బార్ల గూసున్న ఆంజనేల తీర్గ యిస్తార్ల కట్టల మీద ఎక్కి కూసోని నగు మొకం బెట్టి నమస్తే ' అన్నడు వైకుంఠం.

ఈ సందట్ల కప్పతల్లి పార్టీని కాని నోడే లేడు. రొండు పార్టీలోళ్లు ఏకమై 'ఈ ఎండా కాలం ల కప్పలను వట్టుకుంట యాడ తిప్పలు వడ్తరు ? మీకు ఇంతో! అంతో! ముట్టజెప్తం ఈ ఎన్నికలల్ల కెళ్లి బెదఖలు గాండి'' అన్నరంట. అవును మరి! అందితె జుట్టు అందకుంటె కాళ్లు అన్న శాస్త్రం అక్కరకొచ్చింది. ఇంగ వాళ్లేమొ ఇందాక దొర్కవట్టిన కప్పలను గడ్డపార పార్టోళ్ల దిక్కుయిసిరి ఏయవట్టిన్రు. ఇసొంటోళ్లు అంతకంటె ఏం జేస్తరు ? వాళ్ల పని అంతె! చెప్పుడెందుకని ?

'అన్ని వొగెత్తు సీపురు కట్టపార్టీ సబవొగవెత్తున నడ్సింది ఆనాడు. ఊరి చెరువు

గట్టు ఎగువన పొట్టి గుట్ట అంచున పొరక్కొయ్యెలు ముమ్మరంగ దొర్కేసోట ఏర్పాటైంది సబ. ఊరి మేలు గోరె పార్టీయిదాయె! పాపం ! వూరి బాగే తమ బాగు, అందరి మంచే తమ మంచి అంట పాటం సద్వుతరు. ఈ ఆలోచన కడ్పుల వుట్టి కలె దిప్పంగ సూపు పొరక్కొయ్యల మీద వారిచ్చి 'వొచ్చి పొయ్యే జనాలకు రాంగ పోంగ పొర్క అడ్డం'' మానవసేవనె మాదవయ్యసేవ' అంట వాలంటీర్లను విల్సి పొర్క పీకిచ్చి, ఆ పొర్కను వాళ్లతోటే దులిపిచ్చి కట్టలు గట్టిపిచ్చిను. ఇంగ ఆ కట్టలను లారీల యజమాని పెండ్లం తాయారమ్మ వాళ్ళ వొదినె నాగరాణి వొచ్చి ముక్కిడి దుడ్డు కిరాయి కర్సు దగులకుండ ఈ పొర్కాటలన్ని పట్నంగొంచవోయింది. నిజంగనె ! సేవ అంటె? గిట్లనె వుండాల్నేమొ ? అంట అందరు గుస గుసలు వోయిను.

అయ్యో ! ఎడ్కిర్కపు మంది తిక్కగాగ పోతె ? కొండవోక ఏం జేస్తది. పట్నం బోయి టోకు బ్యారం ల అమ్మిన గని కట్ట వొక్కటికి పది రూపాలు వల్కతది. ఈతల్లి బ్యారం ఎంత వల్కికిస్తదో ? అంట ఆ నోటా ఈ నోటా కతలోలె వొల్కతుండవి.

పుణ్యాత్కురాలు పాపం ! వూరికోసం ఏపుగ పెరిగిన పొర్కల్నంత సాపు జేసింది. అయినగని పట్నం ఎందుకు గొంచవోయిందో ? లారి కర్సులు పెట్టుకోని అంట తెల్వని మంది ముక్కుమీద ఏలేసుకున్నరు.

ఆడజేరినఆడిమొగ అంత ఒగరి సేతులు, ఒగరు వట్టుకోని రాసలీల జేసినట్ల గుండుగ నిలవడి ఎడ్మసేత సీపుర్లు ఎత్తి దివిటీలోలె వట్టుకున్నరు. వాళ్ల నడుంగుల తాయారమ్మ రాదమ్మ తీర్గ నిలవడి సుతారంగ చేతుల సీపిరి వూపుకుంట . ఇగ జూడుండి ! ఈడ గూడిన మణుసులెగాదు , జీవరాశి గూడ నామాట యినాలె ! ఇవి వుత్తుత్త మాటలు గావు ; నా చేతులున్న సీపిరి జూస్తుండరు గద ? ఆఁ ఇంగ ఈ సీపిరికట్ట అంటె ఏమనుకున్నరు ? మన యిండ్లల్ల పేర్కపోయిన మైల గియిల దులిపేది, శుబ్రం జేసేది సీపురు. అందికె మన గాంధిమాత్ముడు ఆడోళ్ల సేతులల్ల కలం కంటె సీపిరే సక్క నంట, కాంగ్రీసు సబనడుంగల నిలవడి సెప్పిండు. ఇంగ మీరే దెల్సుకోండి చీపురు కట్టకు ఎంత ఖదరో ? అనంగనే ఆడున్నోళ్లంత గాంధి తాతకు 'జై జై' అంట నాదిచ్చి పల్క వట్టిను. ఆ జైజైలు ఆగక పొయ్యేటాళ్లకు నడుంగుల ఎవరో అందుకోని అంత ఇన్నంక సప్పట్లుగొడ్తురు గాని జర ఆగుండి అన్నరు. అంత సద్దుమణిగింది. మొదలు వెట్టింది తాయారు.

ఇంతటి మయిమ వున్న చీపుర్లు మనవూళ్లె పెరుగాల్నంటె? మన చెరువు సల్ల గుండాలె, ఈ చెరువు క్షేమంగ వుండాల్నంటె ? చెరువు కట్ట గట్టి గుండాలె. ఇంగ ఆ చెర్వు కట్ట మాట మాటకు తెగకుండ గట్టిగ వుండాల్నంటె నేను మెంబర్నిగావాలె. మళ్ల నేను మెంబర్ని గావల్నంటె ? మీరంత నాకు వోటు ఏయాలె, మీవోట్ల తోటి నేను గెల్సెటందుకుమన సేతులల్ల ఈ సీపుర్లు మెర్సెటందుకు, అవి పెర్గెటందుకు, అంత మంచి గుండెటందుకు నాకు మీ వోటు ఇయ్యుండి నమస్తె అన్నది. మొగోళ్ళు ఆడోళ్ల సేతులు వట్టుకోంగ ఆడోళ్లంత సీపుర్లు గిరా గిరా దిప్పిన్రు.

ఇంగ పాపం ! సిమ్మయ్య ! తన దోస్తు మస్తాను గాడు గాడ్దిని యిస్తనని మాటిచ్చి, ఐన్‌మొఖాల మొకం దప్పిస్తె చేసేది లేక సొతాగ తానె తన ఎదమీద అవుసుల ఎంకటయ్యతోన గాడ్ది బొమ్మనందింపిచ్చుకోని రచ్చకట్టన ' నిలవడి అయ్యలూ ! అమ్మలూ ! నా ఎద దిక్కు జెర పాటిచ్చి సూడుండి ! ఏందో ? తెలుస్తది. అన్ని బర్వులు మోసేది గాడ్ది అంటె ఖరం, ఇంగ నేనొక్కణ్ణే దాని బరువు గుడ మోసుకుంట వొచ్చిన, యింత గాడ్ది బర్వు మోసినోణ్ణి సెర్వుకట్ట బారం మోయ లేన ? ఏంది ? అన్నిటికి సాక్షికం మీరే వుండరు . ఇంగ మీ యిష్టం ! మీ వోణ్ణి ! నాకు వోటు ఇయ్యుండి ! నమస్తె ! అన్నడు. వో జనం అంత కడుపులుబ్బ నగుకుంట సప్పట్లు దడ దడ, సట, సట, గొట్టిన్రు . సబ ముగిసింది అంత ఇండ్లల్లకు నడ్సిన్రు.

ఎప్పటితీర్గ కొట్లాటలు, జగుడాలు లేకుండ తొల్తనె ఖారారు జేస్కున్నరు.

ఈ త్యాప చెర్వుకట్ట గుత్త ఇస్తారు పార్టి ప్రెసిడెంట్ వైకుంటానికి, ఇం గ తఖ్తు తాయారమ్మకు, సిమింటు , బొంగులు, ఇన్ప సలాకలు, ఉస్కె, దేని ధర దానికి గిట్టు వాటు గాంగ మిగిలింది సెరి సగం అంట ఇద్దరి నడుంగుల పెద్ద మణుసుల నొప్పందం గుదిరింది. జనం యిదంత జూసి, యిని, ' యా రాయి ఐతె ఏంది ? పండ్లూడ గొట్టుకునెటందుకు ? ఇంగ యాగురైతెఏంది ? గుద్దెటందుకు ? అంట వొక్కచిత్తం జేసుకున్నరు.

నిజంగనె ! ఆనాటి జనాలకు 'బుక్కిందె దక్కింది'.